క్లుప్తంగా

## సాయన్న విగ్రహావిష్కరణపై రాజకీయం తగదు

హన్వాడ: మండల కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహావిష్కరణపై రాజకీయాలు చేయడం తగదని బీఆర్‌ఎస్ మండల నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. సబ్బండ వర్గాలకు చెందిన పండుగ సాయన్న విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీలోని ఓవర్గం నాయకులు బేదాభిప్రాయాలు తెచ్చేవిధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. స్థానికేతరులతో విగ్రహాన్ని ఆవిష్కరించే ఏర్పాట్లు చేస్తున్నారని.. దీన్ని మానుకోవాలని హితవు పలికారు. ఈ అంశంపై శుక్రవారం స్పష్టమైన ప్రకటన చేయాలని అన్నారు. సమావేశంలో ఎఫ్‌ఏసీఎస్ చైర్మన్ వెంకటయ్య, మాజీ ఎంపీపీ బాల్‌రాజు, లక్ష్మయ్య, శ్రీనివాసులు, నరేందర్, జంబులయ్య, బసిరెడ్డి, హరిశ్చందర్ ఉన్నారు.

## కబ్జారాయుళ్లపై చర్యలు తీసుకోవాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలో ఖాళీ స్థలాలను కబ్జా చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కన్స్యూమర్ అవేర్‌నెస్ ప్రొటెక్షన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అడమ్స్ కోరారు. ఈ మేరకు గురువారం డీఎస్పీ గాంధీనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాల్కొండలో సర్వే నంబర్ 38/4లో ఖాళీగా ఉన్న ప్లాట్లను కొందరు ఆక్రమణకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆక్రమణలపై ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. కబ్జారాయుళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట కార్యదర్శి వెంకట్‌రెడ్డి ఉన్నారు.

## ఆలయంలో పూజలు



దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో గురువారం ఎంపీ డీకే అరుణ ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆమెకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలో రైల్వే అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని స్థానిక వ్యాపారులు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ఎంపీ వెంట బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.

## భక్తులకు అన్నదానం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీ షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ప్రతి సోమవారం ఆలయంలో భజన మండలి కార్యదర్శి రవీందర్ ఆధ్వర్యంలో భజనలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పి.జయప్రకాశ్, సభ్యులు సుబ్బయ్యశెట్టి, రాఘవరెడ్డి, భూషణ్‌పాండే, ఆర్.వెంకటయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇంజినీర్స్ డే



దేవరకద్ర: మండలంలోని చౌదర్‌పల్లి విశ్వేశ్వరయ్య ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం తెలంగాణ ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అలీ నవాజ్ జంగ్ బహదూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు బాలీశ్వర్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్ పాల్గొన్నారు.

## కత్తెర పురుగు నివారించాలి



నవాబుపేట: మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ చర్యలు చేపడితేనే పంట దిగుబడి ఆశించిన స్థాయిలో ఉంటుందని ఏఓ కృష్ణకిషోర్ అన్నారు. గురువారం మండలంలోని కామారంలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈసందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. పంటలో కత్తెర పురుగును ముందుగానే గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. డెలిగాట్ 0.5 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి ఆకులపై పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే గులాబీ రంగు చారలు ఉంటే 19–19–19 ఒక కేజీ 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పంటకు పిచికారీ చేయాలన్నారు.

# అప్రకటిత విద్యుత్ కోతలు



- రోజులో 4 – 5 గంటలు కరెంటు సరఫరా నిలిపివేత
- అవస్థలు పడుతున్న ప్రజలు
- ముందస్తు సమాచారం లేకుండా కోతలు విధిస్తున్నారని మండిపాటు



జిల్లా కేంద్రంలో కరెంట్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది (ఫైల్)

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. కరెంటు సరఫరా ఎక్కడ ఎప్పుడు నిలిచిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంలో విద్యుత్ మరమ్మతు, నిర్వహణ పనుల పేరుతో గంటల కొద్దీ కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నారు. రోజులో సుమారు 4 నుంచి 5 గంటల పాటు విద్యుత్ కోతలు విధిస్తున్నారు. హౌసింగ్‌బోర్డు కాలనీలో విపరీతమైన కరెంట్ కోతలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. గురువారం ముందస్తు సమాచారం లేకుండా 3 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. గ్రామీణ ప్రాంతాల్లోనూ అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. కరెంట్ ఎప్పుడు పోతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఎండాకాలంలో మాదిరి వానాకాలంలో కూడా విద్యుత్ కోతలు యథావిధిగా ఉన్నాయని అంటున్నారు. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసినప్పుడు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం సహజమని.. చిన్నపాటి చినుకులు కురిస్తే కరెంటు తీయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ లైన్, సబ్‌స్టేషన్ల మరమ్మతు, నిర్వహణ పేరుతో ఇష్టానుసారంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని వాపోతున్నారు.

### ఇష్టం వచ్చినట్లు కోతలు విధిస్తున్నారు..



ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇష్టం వచ్చినట్లు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నారు. కరెంటు ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో అర్థం కావడం లేదు. గురువారం 3 గంటల పాటు సరఫరా నిలిపివేయడంతో ఇబ్బందులు పడ్డాం.

– బాల్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్, హౌసింగ్‌బోర్డు కాలనీ

### మరమ్మతు కోసం అంతరాయం..

విద్యుత్ లైన్, సబ్‌స్టేషన్ మరమ్మతు, నిర్వహణ పనులు చేపట్టినప్పుడు మాత్రం తప్ప, మిగతా సమయాల్లో విద్యుత్ అంతరాయం లేదు. వర్షాలు పడుతున్న కారణంగా అప్పుడప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలు తొలగిస్తున్నాం. గురువారం పిస్తాహౌస్ వద్ద విద్యుత్ మరమ్మతు కారణంగా హౌసింగ్ బోర్డులో విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

– షకీల్, రూరల్ ఏఈ

# ఎట్టకేలకు మరమ్మతు పనులు



రూం నం. 13లో కొనసాగుతున్న మరమ్మతు పనులు

సాక్షి ఎఫెక్ట్..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎట్టకేలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం పై అంతస్తులోని రూం నం.13లో గురువారం మరమ్మతు పనులు ప్రారంభించారు. వాస్తవానికి ఈ రూంతో పాటు నం.24లోని గోడలు కొన్ని నెలల క్రితమే నెర్రలిచ్చాయి. వీటి మధ్య ఉన్న కారిడార్ లోనూ పై పెచ్చులూడిపోయాయి. అలాగే టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లోనూ ఓ మూలన పెచ్చులూడి స్లాబ్ సీకులు తేలాయి. ఈ విషయమై గత మే 1న 'మున్సిపల్ కార్యాలయంలో పెచ్చులూడుతున్న పైకప్పు' శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఆ వెంటనే రూం నం.13 లోని శానిటేషన్ విభాగాన్ని గ్రౌండ్ ఫ్లోర్‌లోని రూం నం.9లోకి, 24లోని జనన, మరణాల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే ఏఎస్‌ఓతో పాటు సిబ్బందిని పక్క గదిలోకి మార్చారు. చివరికి స్పందించిన మున్సిపల్ అధికారులు రెండు నెలల తర్వాత ఇప్పుడు మరమ్మతు చేసేందుకు ముందుకు రావడం గమనార్హం.

# అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో జాప్యం వద్దు



అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

భూత్పూర్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో జాప్యం చేయకుండా త్వరగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని కొత్త కప్పెట ప్రాథమిక పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిని తెలుసుకోవడంతో పాటు పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను చూశారు. గ్రామంలో తాగునీటి సరఫరా, డ్రెయినేజీ వ్యవస్థపై ఆరా తీశారు. అనంతరం పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. అదనపు కలెక్టర్ వెంట ఎంపీఓ శ్రీదేవి, ఏపీఓ విమల, హెచ్‌ఎం నారాయణ ఉన్నారు.

# న్యాయవాదుల విధుల బహిష్కరణ



నిరసన వ్యక్తంచేస్తున్న న్యాయవాదులు

జడ్చర్ల టౌన్: సిద్దిపేటలో న్యాయవాది రవికుమార్‌పై పోలీసుల దాడిని నిరసిస్తూ గురువారం జడ్చర్ల జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ.. న్యాయవాదిపై దాడి హేయనీయమైన చర్య అని అన్నారు. ఇలాంటి చర్యలను మానుకోవాలని.. దాడిచేసిన ఏఎస్‌ఐపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు యాదిరెడ్డి, తిరుపతి, శ్రీనివాస్‌గౌడ్, రాములు, మహేశ్వర్‌రెడ్డి, విశ్వేశ్వర్, శంకరాచారి పాల్గొన్నారు.

# జీఓ 10ని రద్దు చేయాలి

నవాబుపేట: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు సంబంధించి ప్రభుత్వం తాజాగా జారీ చేసిన జీఓ నంబర్ 10ని రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కురుమయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో అంగన్‌వాడీలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అంటూ అంగన్‌వాడీలను అన్యాయానికి గురిచేయడం తగదన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ. 2 లక్షలు, ఆయాలకు రూ. లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను యథావిధిగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సత్యమ్మ, పుష్ప, పద్మమ్మ, అలవేలు, ప్రమీల, సరస్వతి, సునీత పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతీక.. మొహర్రం



మొహర్రం వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా పోరాడి, ధర్మంవైపు నిలిచిన వారి ప్రాణ త్యాగానికి ప్రతీకగా మొహర్రం వేడుకలు జరుపుకొంటారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీడీ గుట్టలో నిర్వహించిన మొహర్రం వేడుకల్లో ఆయన పాల్గొని పీర్లకు దట్టీలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ జీవితంలో నిజమైన స్ఫూర్తిని మొహర్రం చాటుతుందన్నారు. కులమతాలకు అతీతంగా మొహర్రం వేడుకలు నిర్వహించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రామకృష్ణ, నవకాంత్, రాంలక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

### ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం..

తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బీఆర్‌ఎస్ నాయకుడు రామకృష్ణను గురువారం జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సన్మానించారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి ఎల్లప్పుడూ తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, నవకాంత్, కౌన్సిలర్ రాంలక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, వరద భాస్కర్, కిషన్ పవార్, కురుమయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు కళాజాత



దేవరకద్ర: మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఆధ్వర్యంలో గురువారం దేవరకద్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సురక్ష పోలీసు బృందం పలు అంశాలపై కళాజాత నిర్వహించారు. చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా బాల్యవివాహాలు చేసేందుకు యత్నిస్తే అడ్డుకొని 1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాలు అధికమైన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడితే 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అమ్మాయిలు, యువతను అక్రమ రవాణాకు పాల్పడితే డయల్ 100కు తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఊర్మిళాదేవి, రాము తదితరులు పాల్గొన్నారు.

# మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ



రంగారెడ్డిగూడలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న జెడ్పీ సీఈఓ రాఘవేందర్‌రావు

రాజాపూర్/మిడ్జిల్: మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందని జెడ్పీ సీఈఓ రాఘవేందర్‌రావు అన్నారు. వన మహోత్సవంలో భాగంగా గురువారం రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని మొక్కలను విరివిగా నాటి పెంచాలని కోరారు. గ్రామపంచాయతీలకు నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటి పెంచాలని ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మశ్చందర్, ఎంపీఓ వెంకట్రాములు, వీఏఓ లక్ష్మీనారాయణగౌడ్, ఏపీఓ భారతి పాల్గొన్నారు.

- మిడ్జిల్ మండలం భైరంపల్లి, రాణిపేట గ్రామాల్లో అడిషనల్ డీఆర్డీఓ ముషాహిదా మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, ఏపీఓ రాజేష్, టీఏలు రవి, అమీర్, కార్యదర్శులు వేణమ్మ, సుదర్శన్, ఎఫ్ఏ ఇందిర, రమేష్ పాల్గొన్నారు.

# కు.ని.పై ప్రజలకు అవగాహన కల్పించాలి



జిల్లా కేంద్రంలో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణ

పాలమూరు: కుటుంబ నియంత్రణ పద్ధతులు ప్రతి ఒక్కరూ పాటించాలని, తాత్కాలిక పద్ధతుల్లో అంతర ఇంజక్షన్లు వాడుకోవాలని, వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని డీఎంహెచ్‌ఓ కృష్ణ పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన సమయంలో గర్భధారణ, గర్భం మధ్య అంతరం తల్లిబిడ్డలకు క్షేమదాయకన్నారు. జిల్లాలో కుటుంబ నియంత్రణ కోసం ప్రతి మంగళవారం, శుక్రవారం మహబూబ్‌నగర్ పీపీయూనిట్‌లో కుని ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఒక సంతానం కలిగిన దంపతులకు, అంతర ఇంజక్షన్లు వాడుతున్న వారికి నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. అలాగే జిల్లాలో కుటుంబ నియంత్రణ కోసం విశిష్ట సేవలు అందించిన ఉద్యోగులు, సిబ్బందిని అవార్డులతో సన్మానించారు. ఉత్తమ సర్జన్‌గా డాక్టర్ భాస్కర్‌నాయక్, ఉత్తమ మెడికల్ ఆఫీసర్‌గా దేవరకద్ర మెడికల్ ఆఫీసర్ శరత్‌చంద్ర, ఉత్తమ స్టాఫ్‌నర్స్‌గా సలోమి దీప్తి, ఉత్తమ సూపర్‌వైజర్‌గా సత్యమ్మ, ఉత్తమ ఎంపీహెచ్‌ఏలుగా పద్మ, శారద, ఉత్తమ ఆశలుగా చంద్రకళకు అవార్డులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ శశికాంత్, సంధ్యకిరణ్మయి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: చిన్న కుటుంబాలతో చింతలేకుండా జీవనం సాగించవచ్చని మండల మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పుష్పవేణి, శాంతమ్మ పీహెచ్‌ఎన్ లూయిస్, ల్యాబ్ టెక్నీషియన్ నయ్యాం, ఫార్మసిస్టు శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు లక్ష్మి, శైలజ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జనాభా నియంత్రణ పద్ధతులను మండల వైద్యాధికారి డా. అబ్దుల్ రబ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ అయూబ్ ఖాన్, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఒబేద్ లత, వెంకటనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నట్లు ఎంఈఓ జయశ్రీ అన్నారు. జిల్లా కేంద్రంలోని క్రిష్టియన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆశ్రయ స్వచ్ఛంద సంస్థ, కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగ్‌లు, మ్యాట్లు, జత చెప్పులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతతో విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ చేయడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు జాన్ సుందర్, గోపి, హెచ్‌ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు మధన్మోహన్, పద్మావతి, మాలతి పాల్గొన్నారు.

హన్వాడ: విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ కిష్యానాయక్ పిలుపునిచ్చారు. ఆశ్రయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం దొర్రితండా, పల్లుతండా, సల్లోనిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో 180 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్, మ్యాట్, ఒక జత చెప్పులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజునాయక్, మాజీ ఎంపీపీ బాల్‌రాజు, సంస్థ ప్రతినిధులు కందూర్ గోవర్ధన్, ఫీల్డ్ ఆఫీసర్ అంజద్, మంజుల, స్వర్ణలత పాల్గొన్నారు.

# ఆదిజాంబవ మహరాజ్‌కు నివాళి

నవాబుపేట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో ఆదిజాంబవ మహరాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శాంతయ్య, యాదయ్య, అంబేడ్కర్, కృష్ణ, రమేష్, శ్రీనివాస్, కర్ణాకర్, చెన్నయ్య, నర్సింహ పాల్గొన్నారు.

# నెల రోజుల్లో జీపీలకు పెండింగ్ బిల్లులు



పొన్నకల్‌లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ బిల్లులను నెల రోజుల్లో ఇప్పించే విధంగా కృషి చేస్తానని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మూసాపేట, అడ్డాకుల మండలాల్లో గురువారం ఆయన పర్యటించారు. మూసాపేట కేజీబీవీలో నిర్వహించిన వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. పదవీకాలం ముగిసిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు రైతు వేదికలో సన్మానించారు. అడ్డాకుల మండలం పొన్నకల్‌లో దోనూరు లింగారెడ్డి కుమారులు డా.కార్తీక్‌రెడ్డి (ఎన్‌ఆర్‌ఐ), డా.కల్యాణ్‌రెడ్డిలు సుమారు రూ. 2 లక్షలతో ఏర్పాటు చేయించిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. సీసీ కెమెరాల నిర్వాహణ కోసం గ్రామ పంచాయతీకి ల్యాప్‌టాప్ అందజేశారు. అనంతరం స్నేహ ఫౌండేషన్ అధినేత రాంరెడ్డి సహకారంతో చేపట్టనున్న పొన్నకల్ బైపాస్ రోడ్డు పనులను ప్రారంభించారు. అదేవిధంగా పాఠశాలలో స్నేహ చికెన్ ఎగుమతుల పరిశ్రమ నిర్వాహకుడు వి.రామేశ్వర్‌రెడ్డితో సహకారంతో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు శెట్టి శేఖర్, తోట శ్రీహరి, నాయకులు నాగార్జున్‌రెడ్డి, రాధిక, విజయమోహన్‌రెడ్డి, బగ్గి కృష్ణయ్య, దశరథ్‌రెడ్డి, లింగారెడ్డి, హేమవర్ధన్‌రెడ్డి, గోవర్ధన్, ధర్మారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



హైదరాబాద్‌కు బయల్దేరిన కార్మికులు

కోయిల్‌కొండ: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎదురింటి నర్సింహులు అన్నారు. గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాకు మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు తరలి వెళ్లారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీలలో 51,308 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వారికి 9 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

నవాబుపేట: హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నాకు బయల్దేరిన పంచాయతీ కార్మికులను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు లక్ష్మయ్య మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో వెంకటయ్య, రమేష్, నర్సింహ, మల్లేష్, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

# ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యం



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు మాదిగల ఉద్యమం ఆగదని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు అన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ కళాభవన్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30, 31వ తేదీలలో టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం, సెప్టెంబర్ 1నుంచి 10వ తేదీ వరకు కొడంగల్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ అభయహస్తం కింద ప్రతి మాదిగ కుటుంబానికి రూ. 12 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2009 విద్యాహక్కు చట్టం అమలు పరచాలని, పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. మాదిగ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాలు కేటాయించాలని, వికలాంగుల పెన్షన్ రూ. 7 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సదా లక్ష్మమ్మ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని, డప్పు కొట్టే, చెప్పులు కుట్టే మాదిగలకు రూ. 5వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు, గౌరవాధ్యక్షుడు నర్సింహులు, ఉపాధ్యక్షుడు బాలరాజు, అధికార ప్రతినిధి రాములు, కృష్ణయ్య, నాగన్న, వెంకటయ్య, మెట్టు అంజమ్మ, విద్యావతి, నర్సిములు, రాజు, మాసయ్య, మహేశ్వర్, వెంకటయ్య, తిరుపతయ్య, ప్రవీణ్, శ్రీను పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



వెన్నాచేడ్‌లో సన్మానం పొందిన ఉపాధ్యాయులు



మొకర్లాబాద్‌లో..

గండేడ్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని వెన్నాచేడ్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రకాంత్ అన్నారు. పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమసమాజ స్థాపనలో ఉపాధ్యాయుడి పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని సూచించారు.

మహమ్మదాబాద్: మండలంలోని మొకర్లాబాద్ యూపీఎస్ నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు వెంకటయ్య, వరమ్మ, సుమిత్ర, విమలాకుమారిని గ్రామస్తులు ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పెంటయ్య, మాజీ సర్పంచ్ రక్షిత శ్రీనివాస్‌రెడ్డి, పద్మమ్మ, వెంకటయ్య, లక్ష్మి, మైబయ్య పాల్గొన్నారు.